29

# సత్సంగసభ్యులు పాటించవలసిన పరలోక పద్ధతులు

పరమతండ్రి 1980లో సైతానుశోధన నుండి సత్సంగమును తప్పించి క్రొత్త సత్సంగమును ప్రసాదించినారు. పూర్వముకంటే ఎన్నోరెట్లు అధికముగా సత్యఆతృతను, సత్యజ్ఞానమును, సత్యకర్మను కలిగియుండే క్రొత్తసత్సంగమును అద్భుతముగా ప్రసాదించినారు. అత్యధిక స్థాయిలో నమ్మకము, త్యాగము, ఓర్పు, గురుభక్తి, సంఘసేవ, సత్యము కొరకు లోకమును లెక్కచేయని ధైర్యము కలిగిన క్రొత్తసత్సంగసభ్యులను ప్రసాదించినారు.

సంఘసభ్యులందరు తమ చదువు, కుటుంబ వ్యాపారాలు, ఉద్యోగాలు వంటి బాధ్యతలన్నింటిని సక్రమముగా నిర్వర్తించేవారు. కానీ బంధుసంబంధమైన, లోక సంబంధమైన వ్యవహారాలన్నీ పూర్తిగా వదిలేసేవారు. బంధువులను కలవడం గానీ, మాట్లాడటం గానీ, బంధువుల ఇళ్ళలోని శుభాశుభకార్యములకు వెళ్ళడం గానీ చేసేవారు కాదు. కులాభిమానములను వదిలేసేవారు. కులసంఘాలసభ్యులతో కలవడంగానీ, కులసంఘాల మీటింగులకు వెళ్ళడంగానీ చేసేవారు కాదు. అప్పటివరకు ఉన్న స్నేహితులందరినీ వదిలేసేవారు. అప్పటివరకు స్నేహితులతో కలిసి ఆడిన ఆటలన్నీ మానేసేవారు. అమ్మాయిల వైపు కన్నెత్తి కూడా చూసేవారు కాదు. మత సంబంధమైన మూఢాచారాలేమీ పాటించేవారు కాదు. మతాభిమానమును విడనాడి, సర్వ మత సమానత్వమును పాటించేవారు. అప్పటి వరకు వారిలో ఉన్న కుటుంబ సంబంధమైన, బంధుసంబంధమైన, లోకసంబంధమైన అభిమానములను, ద్వేషములను అన్నింటినీ వదిలేసేవారు. సత్పురుషులను, సంఘసభ్యులనే అభిమానించెడివారు. తమలోని ద్వేషములన్నింటినీ సత్యబద్ధముగా మార్చుకొనెడివారు. తమలోని లోపాలను, తమ కుటుంబ సభ్యులలోని లోపాలను, తమ బంధువులలోని లోపాలను విమర్శించుకుంటూ, తక్కువ తనమును తెలుసుకుంటూ ఆత్మవిమర్శను నేర్చుకొనెడివారు. వారిలో ప్రతి ఒక్కరు దేహపూర్వకముగాను, మనోపూర్వకముగాను తాము ఇంతకు ముందు చేసియున్నట్టి, ప్రస్తుతము చేయుచున్నట్టి తప్పులన్నింటినీ తెలుసుని పశ్చాత్తాపపడుచూ, వాటిని ఒక కాగితముపై వ్రాసి గురుదేవులకు తెలియచేయుట ద్వారా బాప్తిస్మము పొందుచూ పరిశుద్ధులయ్యేవారు.

తమని తాము గొప్పవారిమని హెచ్చించుకునే లోకఅహంకారస్వభావాన్ని విడనాడి, తమని తాము పాపులుగా, అల్పులుగా భావించుకుంటూ తగ్గించుకునే వినయ స్వభావాన్ని నేర్చుకునేవారు. లోకదృష్టిని, స్వార్థబుద్ధిని పూర్తిగా విడనాడి సాధు స్వభావముతో జీవించెడివారు. ప్రతి ఒక్కరు సంఘములో తానే అందరికంటే తక్కువ వాడినని, మిగిలిన సంఘ సభ్యులందరు తనకంటే చాలా గొప్పవారని భావించుకుంటూ అందరియెడల వినయముతో, గౌరవముతో ప్రవర్తించేవారు. ధనవంతులు – పేదవారు, అధికులు–అల్పులు, మనవారు–పరవారు అనే బేదభావములన్నీ వదిలేసి మనుష్యులందరినీ సమభావముతో చూసే మానవత్వాన్ని కలిగియుండి అందరిని సమానముగా గౌరవించేవారు. లోకములోనే ఉంటున్నప్పటికీ లోక సంబంధము కాని పరలోక జీవితమును గడిపేవారు. బాహ్యాబాధ్యతలన్నింటిని సక్రమముగా నిర్వర్తించిన తరువాత మిగిలిన సమయమంతా లోకానికి దూరముగా సత్సంగములోను, సత్కర్మలోను నిమగ్నమైపోయేవారు. ప్రతి ఆదివారము సత్సంగములో పూజ, సత్యబోధ ఉదయము, సాయంత్రము జరిగేవి. ప్రతిరోజు సాయంత్రము గ్రౌండుకు

 continue..

వెళ్ళుట జరిగేది. కొన్నిసార్లు ఉదయము, సాయంత్రము కూడా గ్రౌండుకు వెళ్ళేవారు. గ్రౌండులో శ్రీ శేషబాబు గారు సత్యబోధ చేసేవారు. అవకాశమున్న వారందరు గ్రౌండుకు హాజరయ్యేవారు. సమయాన్ని వ్యర్థము చేయకుండా భక్తి సినిమాలు చూస్తూ, భక్తి గ్రంథములు చదువుచూ, సత్యవాక్యములు వ్రాసుకుంటూ సత్సంగ కార్యక్రమాల సేవలో సత్కర్మ చేసుకుంటూ గడిపేవారు. తలాటం శేషబాబు అనే శ్రీ గురుదేవుల నామాన్ని TSB అనే ఇంగ్లీషు అక్షరాలలో శ్రీ గురుకోటిగా వ్రాస్తూ శ్రీరామకోటి పుస్తకాలయందు శ్రీ గురుకోటి వ్రాసే సత్కర్మను ఏర్పరచుకొనినారు. ప్రతిరోజూ అందరూ గురుకోటి వ్రాస్తూ గురునామాన్ని స్మరిస్తూ ఉండేవారు. వీలున్నప్పుడల్లా సత్సంగ సభ్యులతోనే కలిసియుంటూ లోకముతో సంబంధము లేకుండా జీవించెడివారు. సద్గురుమూర్తియగు శ్రీ శేషబాబు గారి యందలి దైవీశక్తులే శిష్యులందరిలో ప్రవేశించి వారి పాత లోక జీవితాన్ని పూర్తిగా మార్చివేసి వారిని లోకాతీతులైన మహర్షుల వలె కనిపింపచేసేవారు. అప్పటి వరకు అల్లరిచేస్తూ ఆటలాడుతూ ఉండే అంత చిన్నవయసు కుర్రవాళ్ళు ఒక్క సారిగా అన్నీ వదిలేసి వేదాంతము మాట్లాడుచూ భక్తి, దేవుడు అంటూ వింతగా మారిపోవడము చూసేవారికి విచిత్రముగాను, ఆశ్చర్యముగాను, పిచ్చిగాను కనిపించేది.

1970 నుండి శ్రీ శేషబాబుగారు సత్యమార్గములో సాధన చేసి తనలో ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యము అనే దైవీశక్తులను మేల్కొలిపియున్నారు. అట్టి సాధన సమయములో ఆయనయందు ఉద్భవించిన సత్యఆతృత, సాధుస్వభావము, సమత్వభావన, సత్యజ్ఞానము వంటి దేవతాశక్తులనే ఆయన సత్సంగ సభ్యులందరికీ ప్రసాదించుచున్నారు. సత్సంగ సభ్యులెవ్వరికీ ఆత్మవిమర్శ, జాలి, వైరాగ్యము సాధనలేమీ తెలియనప్పటికీ శ్రీ గురుదేవులు తమలోని దేవతాశక్తులనే వారిలో ప్రవేశపెట్టి తన కృపతో ఒక్కసారిగా వారిని సాధుస్వభావులుగా, లోకాతీతులుగా, సత్యజ్ఞానులుగా, మాయారహితులుగా, సత్పురుషులుగా మార్చివేయుచున్నారు. ఏకైకుడు, సర్వాంతర్యామి అయి ఉన్న పరమాత్మ సృష్టిలోని సమస్త జీవులయందు తానే నిండియుండి సమస్త జీవుల యొక్క అనుభూతులను తానే పొందుచున్నారు. అదే విధముగా శ్రీ గురుదేవులలోని దేవతాశక్తులే సంఘ సభ్యులందరిలో ప్రవేశించి, ఆ శక్తులే శ్రీ గురుదేవులను నమ్ముచున్నారు, అనుసరించుచున్నారు, సేవించుచున్నారు, ఆరాధించుచున్నారు. కావున సత్సంగ శక్తులన్నీ శ్రీ గురుదేవుల నుండియే ఉద్భవించుచు సత్సంగము కూడా శ్రీ గురుదేవుల స్వరూపమే అయియున్నది. తద్విరుద్ధముగా కనిపించే కారణములు, ఆకారములు అన్నియు మాయాభ్రమయే అయియున్నవి. సంఘ సభ్యులెవరైతే తమకు ఎట్టి సాధనలు తెలియవు కాబట్టి దేవతాశక్తులు చేయు సత్యజీవనముతో తమకు ఎట్టి సంబంధము లేదని, శ్రీ గురుదేవులలోని దేవతాశక్తులే తమలో ప్రవేశించి


continue..

శ్రీ గురుదేవులను నమ్ముచున్నారు, సేవించుచున్నారు అనే సత్యమును గ్రహించుకుని ఎల్లప్పుడూ జ్ఞాపకముంచుకుంటారో వారియందు అట్టి దేవతాశక్తులు శాశ్వతముగా కొలువైయుండి సత్కర్మ చేయుట ద్వారా వారు ఆత్మాభివృద్ధిని పొందుతారు. దేవతలకర్మవలన లభించే బాహ్య సేవలను కూడా వారు పొందుతారు. సంఘ సభ్యులెవరైతే దేవతాశక్తుల కర్మను తమ కర్మగా భ్రమించి తామే గురుదేవులను నమ్ముచున్నాము, సేవించుచున్నాము అనే తదాత్మ్యమునకు లోనవుతారో వారి నుండి దేవతాశక్తులు దూరమైపోవుదురు. తద్వారా వారు సత్కర్మలకు దూరమైపోయి తమ ఆత్మ స్థితి సహజమగు దుష్కర్మలలో మునిగిపోయి ఆత్మాభివృద్ధిని కోల్పోతారు.

